




# టెస్టులన్నీ ఫ్రీ

## కొండాపూర్ ఏరియా దవాఖానలో టీ డయాగ్నస్టిక్ సేవలు షురూ

### ఖరీదైన రేడియాలజీ టెస్టులు సైతం అందుబాటులోకి..

### 24 గంటల్లోనే రోగుల మొబైల్ ఫోన్లకు టెస్టుల రిపోర్టులు

### హెల్త్‌హబ్‌గా మారిన రంగారెడ్డి జిల్లా

రంగారెడ్డి, జూలై 3 (నమస్తే తెలంగాణ) : అందరికీ వైద్య పరీక్షలను అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది. కొండాపూర్ ఏరియా దవాఖానలో టీ డయాగ్నస్టిక్ ల్యాబ్ ప్రారంభంతో రంగారెడ్డి జిల్లా ప్రజానీకానికి అందుతున్న వైద్య సేవల్లో మరో కీలక అడుగు పడింది. వివిధ టెస్టుల కోసం ప్రైవేట్ ల్యాబ్‌ల్లో రూ.500 నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతుండగా.. టీ డయాగ్నస్టిక్ ల్యాబ్ ద్వారా ఏకంగా 134 రకాల వైద్య పరీక్షలతోపాటు ఎక్స్‌రే, యూసీజీ, ఈసీజీ వంటి రేడియాలజీ టెస్టులు కూడా పూర్తి ఉచితంగా లభించనున్నాయి. ఈ సేవల విస్తరణ కోసం ప్రభుత్వం రూ.రెండు కోట్ల వరకు వెచ్చించింది. ప్రభుత్వ దవాఖానల్లోనే పూర్తి స్థాయి వైద్య పరీక్షలు, సేవలు అందుబాటులోకి రావడంతో జిల్లాలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా హెల్త్ హబ్‌గా మారింది.

అందరికీ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించిన ప్రభుత్వం ప్రజారోగ్య వ్యవస్థను పూర్తి స్థాయిలో బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నది. చిన్న పరీక్షలకు కూడా ప్రైవేట్ దవాఖానలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ దవాఖానలను డెవలప్ చేస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రతి జిల్లాలోనూ డయాగ్నస్టిక్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొస్తుండగా.. తాజాగా రంగారెడ్డి జిల్లాలోనూ ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జూలై 1న రాష్ట్ర వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు జిల్లాలోని కొండాపూర్ ఏరియా దవాఖానలో టీ డయాగ్నస్టిక్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఏర్పాటైన ల్యాబ్‌ల్లో 57 రకాల పరీక్షలను ఉచితంగా అందిస్తుండగా..ఇక నుంచి ఈ ల్యాబ్‌ల్లో అందించే టెస్టుల సంఖ్యను 134కు పెంచారు. వీటితోపాటు పాథాలజీ, రేడియాలజీ ల్యాబ్‌లూ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.

#### నాణ్యమైన వైద్య సేవలు

రంగారెడ్డి జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 21 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 2 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నాయి. కొండాపూర్ దవాఖానను ప్రభుత్వం జిల్లా దవాఖానగా అప్ గ్రేడ్ చేసి వంద పడకల సామర్థ్యానికి పెంచింది. రెండు ఆక్సిజన్ ప్లాంట్లు, రెండు ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, రెండు వెంటిలేటర్ల సదుపాయాన్ని కల్పించింది. కరోనా వ్యాధి చికిత్సలకు సైతం 120 పడకల సామర్థ్యంతో ప్రత్యేక వార్డును కూడా ఏర్పాటు చేశారు. వనస్థలిపురం ఏరియా దవాఖానలోనూ ఆక్సిజన్ ప్లాంట్లు, డయాలసిస్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. అలాగే మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల దవాఖానల్లోనూ డయాలసిస్ సేవలు అందుతున్నాయి. గచ్చిబౌలిలోని టిమ్స్ దవాఖానలోనూ 1200 పడకల సామర్థ్యంతో ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి. బస్తీల్లో 59 బస్తీ దవాఖానలు, పట్టణ ప్రాంతాల్లో తక్షణ ఆరోగ్య అవసరాలు తీర్చేందుకు 24 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో 82 పల్లె దవాఖానలు సేవలు అందిస్తున్నాయి. ఒకప్పుడు ఏ చిన్న రోగం వచ్చినా ప్రైవేట్ దవాఖానలకు వెళ్లాల్సి వచ్చేది. అధికంగా డబ్బులు ఖర్చు అయ్యేవి . ఇది సామాన్య ప్రజలకు పెను భారంగా ఉండేది. ఆ పరిస్థితులకు నేడు ప్రభుత్వ దవాఖానలు చరమగీతం పాడుతున్నాయి. 24 గంటలూ ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి.

> 'కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనే పరిస్థితి ఉండేది. కానీ.. ఇప్పుడు 'నేను సర్కారు దవాఖానకే పోతా..' అనే రోజులను సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు.
>
> - వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు

#### 24 గంటల్లోనే టెస్టుల రిపోర్టులు

పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఖర్చుకు వెనకడుగు వేయకుండా డయాగ్నస్టిక్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నది. కొండాపూర్ ఏరియా దవాఖానలో ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో కరోనా పరీక్షలతోపాటు బీపీ, షుగర్ వంటి సాధారణ వ్యాధులతోపాటు అనీమియా, హెచ్‌ఐవీ, 2డీ ఇకో, వైరల్ లోడ్ తదితర టెస్టులు అందుబాటులోకి వచ్చాయి. అలాగే రేడియాలజీ సేవల ద్వారా ఎక్స్‌రే, యూసీజీ.. మహిళలకు సంబంధించిన క్యాన్సర్ పరీక్షలు, హై ఎండ్ అల్ట్రాసౌండ్ వంటి ఖరీదైన స్కానింగ్‌లను ఉచితంగా చేయనున్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ దవాఖానల్లో ఇచ్చిన శాంపిళ్లను కొండాపూర్ టీ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో ప్రాసెస్ చేసి 24 గంటల్లోనే పరీక్షా ఫలితాలను అందిస్తున్నారు. సంబంధిత రిపోర్టులను రోగుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌ల రూపంలో పంపిస్తున్నారు. కార్పొరేట్ దవాఖానల్లో అందుబాటులో ఉండే అత్యాధునిక యంత్రాలన్నీ కొండాపూర్‌లోని డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో అందుబాటులో ఉన్నాయి.



అందుబాటులోకి వచ్చిన ఆధునిక యంత్రం



- జోరుగా వ్యవసాయ పనులు
- వర్షాలు కురుస్తుండటంతో విత్తనాలు విత్తుతున్న రైతులు



బొంరాస్‌పేట మండలం నాగిరెడ్డిపల్లిలో విత్తనాలు వేస్తున్న రైతులు

# అన్నదాత సాగుబాట

## విత్తనాలు, ఎరువులను కొంటున్న రైతన్నలు

బొంరాస్‌పేట, జూలై 3 : వికారాబాద్ జిల్లాలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. వానకాలంలో పంటలు పండించేందుకు.. విత్తనాలు విత్తే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. మృగశిర కార్తె తర్వాత వానలు కురువకపోవడంతో ఆందోళనకు గురైన రైతులు ఇటీవల కురుస్తున్న వర్షాలతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దక్కులు దున్ని సాగుకు సిద్ధంగా ఉంచుకోగా విత్తనాలను విత్తుతున్నారు. జిల్లాలోని మెట్ట భూముల్లో వర్షాధారంగా పత్తి, కంది, మొక్కజొన్న, పెసర.. వ్యవసాయ బోర్లు, చెరువుల కింద ఎక్కువగా వరి పంటను సాగు చేస్తున్నారు. నల్లరేగడి భూముల్లో ఎక్కువగా కంది, పత్తి పంటలను సాగు చేస్తారు. బొంరాస్‌పేట, దోమ, దౌల్తాబాద్, పరిగి తదితర మండలాల్లో పెసర పంటను ఎక్కువగా సాగు చేస్తారు. మృగశిర కార్తెకు ముందు రోహిణి కార్తెలో కురిసిన వర్షాలకు కొంతమంది రైతులు విత్తనాలు వేసినా తీవ్రమైన ఎండలకు అవి మొలకెత్తలేదు. అలాంటి వాటిని తొలగించి మళ్లీ వేస్తున్నారు.

#### జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5.46 లక్షల ఎకరాలు

వికారాబాద్ జిల్లాలో వానకాల సాధారణ సాగు విస్తీర్ణం 5,46,205 ఎకరాలు. గతేడాది వానకాలంలో 5,81,464 ఎకరాలలో రైతులు పంటలను సాగు చేయగా.. ఈ వానకాలంలో 5,90,308 ఎకరాలలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 68,789 ఎకరాలలో విత్తనాలు వేశారు. ఈ వానకాలంలో పత్తి 2, 55,980 ఎకరాలలో, కంది 1,60,824, వరి 95,690, మొక్కజొన్న 53,322, జొన్న 2560, పెసర 12690, మినుములు 5252 , సోయాబీన్ 2990 ఎకరాలలో సాగు చేసే అవకాశముందని అధికారులు అంచనా వేశారు.



దుద్యాలలో ఎరువులు కొంటున్న రైతులు

## ఫరూఖ్‌నగర్ మండలంలోని 48 గ్రామ పంచాయతీల్లో ..



మున్సిపాలిటీ సమీపంలోని పొలంలో విత్తనాలను చల్లుతున్న మహిళలు

షాద్‌నగర్ టౌన్, జూలై 3 : కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ, ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం, కొండన్నగూడ, నాగులపల్లి, చించోడు, లింగారెడ్డిగూడ, మధురాపూర్, దూసకల్, గంట్లవెల్లి, సోలీపూర్, దేవునిపల్లి, హాజిపల్లి, కిషన్‌నగర్, భీమారం, కాశిరెడ్డిగూడ, ఎలికట్ట, మొగిలిగిద్దతోపాటు పలు గ్రామాల్లోని రైతులు పొలాలను వరి సాగుకు సిద్ధం చేసు కోగా.. మరికొందరు పొలాల్లో విత్తనాలను విత్తుతున్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని 48 గ్రామ పంచాయతీల్లో 24,826 ఎకరాలలో రైతన్నలు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. 13,016 ఎకరాలలో వరి, మొక్కజొన్న 4163, జొన్న 247, పత్తి 1700 , కూర గాయలు 490, కందులు 561, ఉద్యానవన పంటలను 4649 ఎకరా లలో సాగు చేస్తున్నారు. మండలంలోని 25,473 మంది రైతులకు సర్కారు రైతుబంధు పథకం కింద రూ. 22.69 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నది. కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్న రైతులు విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకుంటున్నారు. రైతులు విత్తనాలు, ఎరువులను లైసెన్స్ డీల్లర్ల వద్దే కొనాలని, సంబంధిత రసీదులను వెంటనే తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

#### విత్తనాలను విత్తుకునేందుకు సిద్ధంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు విత్తనాలను విత్తుకునేందుకు సిద్ధంగా ఉండాలి. వరి నార్లు పోసేవారు స్వల్పకాలిక వరి రకాలను ఎంచుకోవాలి. సోయా చిక్కుడును ఈ నెలాఖరు వరకు, పత్తిని జూలై 20వరకు, మొక్కజొన్న, పెసర, మినుములు జూలై 15 వరకు, ఆముదాలు, సన్‌ఫ్లవర్, ఉలవలు జూలై 31వరకు, కంది ఆగస్టు 15వరకు సాగు చేసుకోవచ్చు. సాగులో సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. ప్రభుత్వ గుర్తింపు ఉన్న విత్తనాలు, ఎరువులను మాత్రమే కొనాలి. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-నిశాంత్‌కుమార్, ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి, షాద్‌నగర్




నాగుపల్లి గ్రామంలో వరిసాగుకు సిద్ధం చేస్తూ..




#### చెప్పుకోండి


1. 'పింక్ సిటీ'గా పేరుగాంచిన నగరం ఏది?
2. తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం ఎక్కడ ఉన్నది?
3. కిరణజన్య సంయోగక్రియలో వెలువడే వాయువు ఏది?



#### పెద్దల మాట

ఆశయాలను ఆచరణలో పెడితే.. మహనీయులవుతారు.

- డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్





#### పదస్పృష్టి

కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

machine

Ex : man

#### టంగ్ ట్విస్టర్స్

How can a clam cram in a clean cream can?



#### జవాబులు

1. జైపూర్, 2. ములుగు (సిద్దిపేట జిల్లా), 3. ఆక్సిజన్


#### లిటిల్ హ్యాండ్స్

పి. మనస్విని, నల్గొండ.





#### కథ




## విచక్షణతోనే విలువ

సింహపురి రాజ్యాన్ని శ్రీవర్ధనుడు పరిపాలించేవాడు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా తన పరిపాలన ఉండేది. మంత్రి రామశర్మ చక్కని సలహాలు ఇస్తున్నా.. తనకు నచ్చినట్లే పాలించేవాడు మహారాజు. అలా ఆలోచన లేకుండా నిర్ణయాలు తీసుకోకూడదని మంత్రి ఎంత చెప్పినా వినేవాడు కాదు. వేగుల ద్వారా పక్కరాజ్యమైన విక్రమపురి పరిపాలన గురించి తెలుసుకునేవాడు. ఒకసారి వేగులు.. ''రాజా! అక్కడ ప్రతి ఇంట్లో విక్రమపురి రాజుగారి చిత్రపటం ఉంది. రాజుగారి పరిపాలనకు ప్రజలు జేజేలు పలుకుతుంటారు'' అని చెప్పారు. అది విన్న శ్రీవర్ధనుడు, వెంటనే మంత్రి రామశర్మను పిలిపించి.. ''మంత్రివర్యా! నా చిత్రపటాలు గీయించి రాజ్యంలో ప్రతి ఇంటికీ అందజేయండి. ప్రతి ఇంట్లో నా చిత్రపటం ఉండాలి. ఇది నా ఆజ్ఞ!'' అని చెప్పాడు. మహారాజు మాటకు ఎదురు చెప్పలేక.. ''అలాగే మహారాజా!'' అన్నాడు మంత్రి. ఆస్థానంలోని చిత్రకారులను పిలిపించి రాజు చిత్రాలను గీయించారు. రాజ్యంలోని ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. మహారాజుకు విషయం తెలియజేశారు. దాంతో ఆయన చాలా ఆనందించాడు. కొన్నిరోజుల తర్వాత వచ్చిన వేగులతో.. ''మన రాజ్యంలోని ప్రతి ఇంటా నా చిత్రపటం ఉంది కదా!'' అని అడిగారు. అప్పుడు వేగులు.. ''మహారాజా! ఇప్పుడు మన రాజ్యంలోని ఏ ఇంట్లోనూ మీ చిత్రపటాలు కనిపించడం లేదు'' అని చెప్పారు. దాంతో శ్రీవర్ధనుడికి కోపం వచ్చింది. మంత్రిని పిలిపించి చిర్రుబుర్రు లాడాడు. ఆయన కాస్త శాంతించిన తర్వాత.. ''మహారాజా! విక్రమపురి రాజ్యంలో రాజుగారి నిర్ణయాలు ప్రజలకు నచ్చి, రాజుగారి చిత్రపటాన్ని వారే చిత్రకారులతో వేయించుకొని తమ ఇంట్లో పెట్టుకున్నారు. అంటే పాలకుడు తీసుకునే నిర్ణయాలు ప్రజల హృదయాలలో నిలిచిపోవాలి. అప్పుడే ప్రతి ఇంట్లో కొలువై ఉంటాడు. మన రాజ్యంలో మాత్రం.. ప్రజలకు ఇష్టం ఉన్నా లేకపోయినా మీ ఆజ్ఞతో తీసుకున్నారు. కొన్ని రోజులు ఉంచుకున్నారు. తర్వాత పడేశారు. మీ నిర్ణయాలు వారికి రుచించకపోవడం వల్లే, మీపట్ల వాళ్లకు సానుకూల దృక్పథం లేదు. ప్రజల మనసులు గెలిచిన వాడే, వారి మనసులలో కొలువై ఉంటాడు. అందుకే, మంచి నిర్ణయాలు తీసుకొని పాలన చేస్తే, ప్రజలే మిమ్మల్ని దేవుడిగా కొలుస్తారు. ప్రజా సంక్షేమమే రాజుకు జయం!'' అని వివరించాడు మంత్రి. ఆ మాటలతో శ్రీవర్ధన మహారాజు ఆలోచనలోపడ్డాడు. 'నిజమే! ఇన్నాళ్లూ నేను అనుకున్నదే జరగాలని భావించాను. ఏదైనా నిర్ణయం తీసుకునేముందు.. మంచి చెడు విచక్షణ ఉండాలి' అనుకున్నాడు. అప్పటినుంచి ప్రజారంజకంగా పరిపాలించ సాగాడు. ప్రజలు కూడా తమ రాజుగారిని మనసులలో నిలుపుకొన్నారు.

- మొర్రిగోపి

#### పూరించండి





బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి

#### జతచేయండి

కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి





పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com